# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను స్థాపించే అవకాశాలను పరిశీలించాలని మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా మంత్రి ఆండ్రూ గైల్స్ ను కోరారు.

- ❖ వైద్య ఖర్చులతో ఆర్థిక సమస్యలను ఎదుర్కొనే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

- ❖ భావితరం జీఎస్టీ సంస్కరణల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందని విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.

- ❖ రానున్న 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=======================

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఈరోజు సిడ్నీలోని టెక్నికల్ అండ్ ఫర్దర్ ఎడ్యుకేషన్ – న్యూ సౌత్ వేల్స్ (TAFE NSW) క్యాంపస్‌ను సందర్శించారు. మేనేజింగ్ డైరెక్టర్ క్లో రీడ్, ఇంటర్నేషనల్ డైరెక్టర్ జేమ్స్ ఫ్లనాగన్, గ్లోబల్ ఎంగేజ్ మెంట్ సీనియర్ మేనేజర్ యువాన్ పెంగ్ తదితరులు లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆస్ట్రేలియా స్కిల్ అండ్ ట్రైనింగ్ మంత్రి ఆండ్రూ గైల్స్ తో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేశ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రాధాన్యతా రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లను స్థాపించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కోరారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక కారిడార్లలో TAFE NSW స్కిల్ హబ్ లేదా ఇంటర్నేషనల్ క్యాంపస్ స్థాపించే అవకాశాలను చూడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఐటీఐలు, నైపుణ్య శిక్షణ సంస్థల కోసం పాఠ్యప్రణాళిక రూపకల్పన, ఉపాధ్యాయ శిక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయాలని ఆహ్వానించారు. విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ - 2025కు హాజరు కావాలని లోకేశ్ కోరారు.

=======================

వైద్య ఖర్చుల భారంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారి జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) వెలుగులు నింపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆయన ఈరోజు లబ్ధిదారులకు 6 లక్షల 77 వేల 460 రూపాయల విలువైన CMRF చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేదలకు అన్ని విధాలా మేలు చేస్తోందన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తం అందిస్తోందన్నారు. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు.

========================

భావితరం జీఎస్టీ సంస్కరణల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వచ్చిన నెల రోజుల్లోనే ప్రజలకు లక్ష కోట్ల రూపాయల ఆదా జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో జీఎస్టీ సంస్కరణల సంబరాలను ఒక పండగ వాతావరణంలో నిర్వహించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆడపిల్లల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత అని, విజయనగరం పార్లమెంట్ పరిధిలో ముగ్గురు ఆడపిల్లలకు జన్మనిచ్చిన వారి కుటుంబాలకు 50 వేల రూపాయల ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్టు ఎంపీ వెల్లడించారు.

========================

మచిలీపట్నం అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో ఈరోజు జరిగిన దీపావళి వేడుకలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో నిరంతరం ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. హైదరాబాద్ నుండి మచిలీపట్నం వరకు 12 వరుసల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. బందరు అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పక్కా ప్రణాళిక అమలు చేయడం జరుగుతుందని, ఈ నిధుల కోసం త్వరలో ఢిల్లీ వెళుతున్నామని మంత్రి తెలియజేశారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

సామాన్య ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం భావితరం జీఎస్టీ సంస్కరణలను చేపట్టిందని బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ అన్నారు. బాపట్లలో ఈరోజు జరిగిన సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్.. ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... 2047 నాటికి భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. 4 స్లాబులుగా ఉన్న జీఎస్టీ విధానాన్ని 2 స్లాబులకు మార్చారని, ప్రజలు వినియోగించే నిత్యవసర వస్తువులు, మందులు, మోటార్ వాహనాల బీమా మొదలైన వాటిపై జీఎస్టీ గణనీయంగా తగ్గిందని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

దక్షిణ అండమాన్ సముద్రానికి ఆనుకొని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో, రానున్న 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ తదుపరి 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాలు, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మరింత బలపడే అవకాశముందని చెప్పారు. మరిన్ని వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 952 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమై... చివరికి 411 పాయింట్ల లాభంతో 84 వేల 363 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 133 పాయింట్ల లాభంతో 25,843 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 87 రూపాయల 93 పైసలుగా ఉంది.

========================

ఏలూరు జిల్లా నిడమర్రులో పోలీసులు, రెవెన్యూ అధికారులు బాణసంచా అక్రమ నిల్వ కేంద్రంపై ఈరోజు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు చేపట్టిన దాడుల్లో ఒక లక్షా 53 వేల 500 రూపాయల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. భువనపల్లి గ్రామ శివారులోని ఒక రేకుల షెడ్ లో పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారంతో అగ్నిమాపక, రెవెన్యూ అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించామని నిడమర్రు ఎస్ఐ. రమేష్ తెలిపారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

========================
========================